క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నర్సిపల్లెలో పల్లె మద్దిలేటిరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి

ఉయ్యాలవాడ : మండలంలోని నర్సిపల్లె గ్రామ సర్పంచ్ పల్లె గురుప్రసాద్‌రెడ్డి కుటుంబాన్ని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి (నాని) శుక్రవారం పరామర్శించారు. పల్లె గురు ప్రసాద్‌రెడ్డి తండ్రి, గ్రామమాజీ సర్పంచ్ పల్లె మద్దిలేటిరెడ్డి అనారోగ్యంతో నంద్యాల ఒక ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న నాని గ్రామానికి చేరుకుని మాజీ గ్రామ సర్పంచ్ ఆరోగ్య పరిస్థితి, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గజ్జెల క్రిష్టారెడ్డి, ఉయ్యాలవాడ, హరివరం సొసైటీ మాజీ చైర్మన్‌లు బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, పల్లె మహేశ్వరరెడ్డి, మాజీ గ్రామ సర్పంచ్‌లు పోచా రాధాక్రిష్టారెడ్డి, తరిగోపుల ప్రసాద్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఎర్రి శ్రీనివాసరెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ మాజీ ఉపాధ్యక్షుడు కూలూరు నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ఈ భూమి నాది.. పండించిన పంట నాది.. తీసుకెళ్లడానికి దొరెవ్వడు అంటూ మాటల తూటాలు పేల్చి దొరల గుండెల్లో బడబాగ్ని రగిల్చిన వీరనారి చాకలి ఐలమ్మ చైతన్యానికి ప్రతీక అని రజక సంఘం ఐక్యవేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు కుసుమాంబ, నాయకులు బాలరంగయ్య అన్నారు. స్థానిక చాబోలు రోడ్డులోని కార్యాలయంలో చాకలి ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా రజక సంఘం ఐక్యవేదిక నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఏదో యూనివర్సిటీకి ఐలమ్మ పేరు పెట్టాలన్నారు. అదే విధంగా ఐలమ్మ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి విద్యార్థుల్లో ధైర్య సాహసాలు నింపేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సీడ్స్ మద్దిలేటి, శ్రీరాములు, నాగరాజు, రాము, అంజి, శీను తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం.. రైతుకు లాభదాయకం



మాట్లాడుతున్న జయప్రకాష్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): ప్రకృతి వ్యవసాయం రైతుకు అన్నివిధాలుగా లాభదాయకమనినంద్యాల డివిజన్ ఇన్‌చార్జి ఏడీఏ జయప్రకాశ్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అబ్దుల్ సలామ్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డివిజన్‌లోని వీఏఏ, వీహెచ్‌ఏ, ఎంపీఈఓలకు ప్రకృతి వ్యవసాయంలో ఆధునిక పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక డీపీఎంయూ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ జయప్రకాశ్ రెడ్డి మా ట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ సమస్యలు -పంటల దిగుబడులు తగ్గడం, భూమి ఆరోగ్యం దెబ్బతినడం, ఆహార నాణ్యతలో తగ్గుదల, ప్రజల ఆరోగ్యంపై ప్రభావం, వాతావరణ మార్పులు వంటి సమస్యల ప్రకృతి వ్యవసాయం చక్కని పరిష్కారమన్నారు. ఈ వ్యవసాయంలో నిరూపిత ఆధునిక శాస్త్రీయ విధానాలను వివరించారు.

పొదుపు మహిళల్లో అక్షర వెలుగు నింపాలి



పొదుపు మహిళలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

దొర్నిపాడు: నిరక్షరాస్యులైన పొదుపు మహిళల్లో అక్షర వెలుగులు నింపాలని డిప్యూటీ ఎంపీడీఓ శివప్రసాద్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డీఆర్‌డీఏ, ఎన్ఆర్ఈజీఎస్ వలంటీర్ టీచర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటి నేర్చుకోవాలన్నారు. వలంటీర్ టీచర్లు ప్రతి వారికి సా యంత్రం రెండు గంటల పాటు చదువు చె ప్పాలన్నారు. ఆన్‌లైన్, డిజిటల్ సేవలు నేర్పించాలన్నారు. 2026 మార్చిలో జరిగే ఎన్ఐఓఎస్ పరీక్షలో పాల్గొన్న వారికి ధ్రువీకరణ పత్రాలు ఇస్తారన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం బాబు, మండల ఇన్‌చార్జ్ పర్యవేక్షకులు ఆదినరసింహ, ఏపీఓ హనీఫా తదితరులు పాల్గొన్నారు.

వాన ముసురు..



క్రిష్టిపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ

దొర్నిపాడు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆళ్లగడ్డ, నంద్యాల నియోజకవర్గాల్లో శుక్రవారం తెల్లవారుజామున నుంచి ముసురుతో వాన కురుస్తోంది. ఇప్పటికే వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా.. పంటపొలాల్లో వర్షం నీరు నిలిచిపోయి తేమశాతం పెరిగిపోయింది. దీంతో మినుము, కంది, బెండ, మొక్కజొన్న, పత్తి పంటలు పూర్తిగా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. తమ కష్టంతో పాటు సాగుకు పెట్టిన పెట్టుబడి వర్షం పాలైపోయిందని చెబుతున్నారు. కాస్త ఎల్లడి ఇస్తే కంది పంటను తొలగించి ప్రత్యామ్నాయంగా మరోపంట వేసుకోవాలని రైతులు చూస్తున్నారు. ఇదిలా ఉంటే క్రిష్టిపాడులో కుందూనది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలపై అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సుభద్ర హెచ్చరించారు.



దొర్నిపాడు శివారులో కందిపంటలో నిలిచిన వర్షపునీరు

వర్షంలోనే మిర్చి కోతలు



రుద్రవరం సమీపంలో మిర్చి కోతలు కోస్తున్న కూలీలు

రుద్రవరం: మండలంలో కురుసున్న వానకు మిర్చి తప్ప మిగిలిన వ్యవసాయ పనులన్నీ ఎక్కడికక్కడే నిలిచి పోయాయి. ప్రస్తుతం వరి పైరులో కలుపును తొలగించడం, రెండో పంటగా మొక్క గింజలు నాటడం, జొన్న సాగు పనులు జరగాల్సి ఉంది. ఖరీఫ్‌లో కాస్త ముందస్తుగా సాగు చేసిన మొక్కజొన్న కోత దశలో ఉంది. పంట కాలం పూర్తి కావడంతో రైతులు కోతలను మొదలెట్టారు. అయితే. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో కోతలకు ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి వివిధ రకాల పైర్లు నీట మునిగాయి. కాగా రుద్రవరం, రెడ్డిపల్లె, ఆర్. నాగులవరం, నర్సాపురం, తువ్వపల్లె,తిప్పారెడ్డిపల్లె, టి.లింగదిన్నె, నర్సాపురం, ఆలమూరు, చిత్రేనిపల్లె తదితర గ్రామాల పరిధిలో వర్షం కురుస్తున్నా రైతులు వర్షపు పట్టలు కప్పుకొని మిర్చి కోతలు సాగిస్తున్నారు. నెల క్రితం 50 కేజీల మిర్చి బస్తా రూ.3 వేలకు పైగా ఉండేది. ప్రస్తుతం రూ.800కు పడి పోయింది. అలాగే వదిలేస్తే కాయలు కుళ్లి రాలి పోతాయని చేసేది లేక కోతలు కోసి తక్కువ ధరకే విక్రయిస్తున్నట్లు రైతులు తెలిపారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



సబ్ జైలులో ఖైదీలను విచారిస్తున్న జడ్జి

ఆళ్లగడ్డ: జైలులో రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న వారు సత్ప్రవర్తనతో జీవించటానికి ప్రయతించాలని 3వ అదనపు జిల్ల జడ్జి అమ్మన్నరాజా అన్నారు. స్థానిక ఉప కారాగారాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారాగారంలో ఉన్న ఖైదీలతో ఏ ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఎప్పటినుంచి రిమాండ్‌లో ఉంటున్నారు. అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులు ఉన్నారా అని ఆరా తీశారు. అలాగే జైలులో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని రిమాండ్ ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైన ఖైదీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపకారాగారాధి సెల్వంత్ ఉన్నారు.

మహిళల ఆరోగ్యంతో బలమైన కుటుంబం



మాట్లాడుతున్న అడిషనల్ డీఎం అండ్‌హెచ్‌ఓ

శిరివెళ్ల: మహిళల ఆరోగ్యంతోనే శక్తివంతమయిన కుటుంబం తయారవుతుందని అడిషనల్ డీఎం అండ్ హెచ్‌ఓ శారదాబాయి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారి-స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ కిశోర బాలికల ఎదుగుదలలో వచ్చే మార్పులు రక్త హీనత, ఇతర రుగ్మతలను గుర్తించి వారికి సకాలంలో చికిత్స చేయించాలన్నారు. మధుమోహం, అధిక రక్త పోటును నియంత్రణలో ఉంచుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో నిర్వహించే మొబైల్ హెల్త్ క్లినిక్‌లను ప్రతి ఒక్కరు సద్వినియోగ పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్ నోడల్ అధికారి డాక్టర్ కాంతారావు, జిల్లా ఫ్యామిలీ డాక్టర్ జగదీష్ చంద్రరెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ అనూష, వైద్య శాల డాక్టర్లు ముఖేష్, ఆంజనేయులు, సీహెచ్‌ఓ రాంమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు యామా గుర్రప్ప, మైనారిటీ నాయకులు ఫీదా హుస్సేన్, సూపర్ వైజర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పెన్షనర్ల సంఘం ఎన్నికలు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న పెన్షనర్లు

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. జోరుగా వర్షం కురుస్తున్నా విశ్రాంత ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 3,400 మంది ఓటర్లు ఉన్న సంఘం అధ్యక్షుడిగా పుల్లారెడ్డి (ఫుట్‌బాల్), రామసుబ్బయ్య (ఏనుగు) గుర్తుల ప్యానళ్లపై పోటీ చేశారు. 813 ఓట్లు మాత్రమే పోలైనట్లు పోలింగ్ అధికారులు పెదన్నగౌడ్, ప్రభాకర్ తెలిపారు. స్థానిక నిశాంత్ భవన్‌లో ఓట్ల లెక్కింపును సాయంత్రం 6 గంటలకు ప్రారంభించారు. తుది ఫలితాలు వచ్చేందుకు సమయం పడుతుందని పోలింగ్ అధికారులు తెలిపారు.

వనరుల పెరుగుదలతోనే గ్రామాభివృద్ధి



పొదుపు సీఆర్‌పీలకు అవగాహన కల్పిస్తున్న పంచాయతీ డివిజనల్ కోఆర్డినేటర్

ఉయ్యాలవాడ : గ్రామ పంచాయతీల వనరులు పెరిగితేనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని నంద్యాల డివిజనల్ పంచాయతీ కోఆర్డినేటర్ దస్తగిరిబాష‌ తెలిపారు. శుక్రవారం ఉయ్యాలవాడ చెత్త సంపద కేంద్రం వద్ద వానుపాముల తయారీపై పొదుపు సీఆర్‌పీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను గృహాల నుంచి వేరు వేరుగా సేకరించి, వాటిని చెత్త సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. సేంద్రియ ఎరువులు తయారు చేయడం ద్వారా రైతులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సేంద్రియ ఎరువులను గ్రామపంచాయతీల ద్వారా విక్రయిస్తే పంచాయతీ వనరులు పెరుగుతాయన్నారు. వనరులు ఉంటే అభివృద్ధి పనులు సాధ్యమవుతాయని గుర్తు చేశారు. ఈ విషయాలు పొదుపు సంఘాల్లోని సభ్యులకు తెలియజేయాల్సిన బాధ్యత సీఆర్‌పీలదేనని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు ఇంకెప్పుడు?

- అర్హత ఉన్నా అందని పింఛన్లు
- దరఖాస్తు చేసుకోవడానికి తెరుచుకోని వెబ్‌సైట్
- పట్టనట్టు వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం
- ఇప్పటికీ ప్రారంభం కాని దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ



కొత్త పింఛన్ కోసం పీజీఆర్ఎస్‌కు వస్తున్న పక్షవాత మహిళ

నంద్యాల(న్యూటౌన్): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా కొత్త పింఛన్ ఒక్కటి కూడా మంజూరు కాలేదు. అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకునేందుకు కనీసం వెబ్‌సైట్ కూడా తెరుచుకోని పరిస్థితి. దీంతో అర్హులైన వితంతువులు, వృద్ధులు, నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. ఎన్నికల సమయంలో కూటమి సర్కారు అర్హులైన ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 సంవత్సరాలకే పింఛన్లు మంజూరు చేస్తామని పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. నమ్మి ఓటేసిన ప్రజలకు ఇప్పుడు చుక్కలు చూపిస్తుంది. చివరకు ఏ దిక్కూ లేని వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు కూడా పింఛన్లు మంజూరు చేయడం లేదు. దీంతో పలువురు అర్హులు ఎప్పుడు పింఛన్ మంజూరు చేస్తారంటూ సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇటీవల స్పౌజ్ కేటగిరీలో పింఛన్ల మంజూరు చేసింది. పింఛన్ పొందుతున్న భర్త చనిపోతేనే భార్యకు ఆ పింఛన్‌ను బదిలీ చేస్తున్నారు. అసలు ఇప్పటికీ పింఛన్ రాని వ్యక్తి చనిపోతే వితంతు పింఛన్ ఇవ్వకుండా మొండి చేయి చూపిస్తు న్నారు. అలాగే ఇతర సామాజిక పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారిని పట్టించుకోవడం లేదు. నంద్యాల జిల్లాలో గత ఏడాది జూన్ మాసానికి 2,22,565 పింఛన్లు ఉండగా ప్రస్తుతం 2,15,397 మంది సామాజిక పెన్షన్ దారులున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులందరికీ పింఛన్..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న ఆరు నెలల్లోనే కొత్త పింఛన్లు మంజూరయ్యేవి. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేకుండా ప్రస్తుత ప్రభుత్వం పెన్షన్‌కు సంబంధించి వెబ్‌సైట్ నిలిపివేయడంతో అర్హులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పింఛన్ల మంజూరులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమనసరించిన విధానమే సరైందని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్‌రులకు ఇంటి వద్దే పింఛను అందించేవారు. భర్త చనిపోయిన వారికి వితంతు పింఛన్లు మరుసటి నెలలోనే ఇచ్చేవారు. ఇలా ఏడాదికి రెండుసార్లు కొత్త పింఛన్లు మంజూరుకు అవకాశం కల్పించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేకపోవడంతో అర్హులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువ శాతం పింఛన్ మంజూరు చేయాలని అర్జీలు అందిస్తున్నారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు

కొత్తపింఛన్ల కోసం నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం నుంచి ఇంకా ఎటువంటి ఆదేశాలు రాలేదు. అందుకు సంబంధించిన వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కొత్త పింఛన్ల నమోదు చేసుకుంటాం.

-శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల



పీఎం సూర్య ఘర్ లక్ష్యాన్ని అధిగమించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లాలో ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాన్ని సమగ్రంగా అమలు చేసి, నిర్ణీత లక్ష్యాన్ని అధిగమించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి మండల స్థాయి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి ఈ పథకం అమలు ప్రగతిని సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కలిగే ప్రయోజనాలపై ప్రజలకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి అర్హుడిని ఈ పథకంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఆర్థిక చేయూత అవసరమైన లబ్ధిదారులకు బ్యాంకర్ల సహకారంతో తక్షణమే రుణాలు మంజూరు చేయించాలన్నారు. జిల్లాలోని కోవెలకుంట్ల, సంజామల, బనగానపల్లె, జలదుర్గం, ప్యాపిలి మండలాల్లో లక్ష్యసాధనలో వెనుకబడి ఉన్నాయన్నారు. ప్రతి ఇంటికీ సౌర విద్యుత్ చేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులతో పాటు ప్రజాప్రతినిధులపై ఉందన్నారు.

ఉపాధి హామీ లక్ష్యాలు సాధించాలి

ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించేందుకు అధికారులు మరింత కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఉపాధి హామీ, ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై మండల స్థాయి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచి పెండింగ్‌లో ఉన్న 5,300 గృహ నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు.

జీఎస్టీ 2.0 ద్వారా సామాన్య ప్రజలకు ఊరట

జీఎస్టీ 2.0 (సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్) ద్వారా సామాన్య ప్రజలకు ఊరట లభించిందని, ఈ విషయం పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లతో జీఎస్టీ 2.0, కుసుమ్/సోలార్ సంస్థలకు భూకేటాయింపులు, వాతావరణ మార్పులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్‌ఓ రాము నాయక్, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ మురళీ మనోహర్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

జిల్లా ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు అన్ని ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లలో క్రమం తప్పకుండా నాణ్యతా పరీక్షలు నిర్వహించి, బీఐఎస్ ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆర్డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆర్‌ఓ ప్లాంట్ల భద్రతా ప్రమాణాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లను తనిఖీ చేసి నీటి నమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపాలన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ఈ ప్రక్రియ సాగాలన్నారు. ప్రమాణాలు పాటించని ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌లను సీజ్ చేయాలన్నారు.

నందమూరినగర్‌లో నాలుగు బైక్‌లు దగ్ధం

నంద్యాల(అర్బన్): పట్టణ శివారులోని నందమూరినగర్‌లో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు నాలుగు బైక్‌లను దగ్ధం చేసినట్లు రూరల్ సీఐ ఈశ్వరయ్య శుక్రవారం తెలిపారు. ఒకే చోట ఉంచిన నాలుగు బైక్‌లను పెట్రోల్ పోసి దగ్ధం చేశారన్నారు. బాధితుడు తిరుమలరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నందమూరినగర్‌లో పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పొదుపు మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

గోస్పాడు: పొదుపు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని,ఇందుకు ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జూలేపల్లె గ్రామంలో పొదుపు మహిళ రమాదేవికి ఎంబ్రాయిడరీ కుట్టు మిషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంఈజీపీ పథకం కింద డీఆర్‌డీఏ ద్వారా పొదుపు గ్రూపుల్లోని మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. అందులో భాగంగా పొదుపు మహిళకు రూ.4.95 లక్షలు విలువ చేసే ఎంబ్రాయిడరీ మిషన్‌ను మంజూరు చేసిందన్నారు. ఇందులో 35శాతం కింద రూ.1.75 లక్షల దాకా సబ్సిడీని ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. పొదుపు గ్రూపుల్లోని ఆసక్తి గల మహిళలు ఇలాంటి అవకాశాలను పొందవచ్చని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీజీబీ మేనేజర్ చంద్రశేఖర్, ఏపీఎం శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



కుట్టు మిషన్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

వైభవోపేతం..నవరాత్రోత్సవం



108 శక్తిపీఠాల అలంకారంలో శ్రీకాళికాంబాదేవి



బొమ్మలసత్రం షిర్డిసాయిబాబా ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



దొర్నిపాడు..పూజల్లో పాల్గొన్న భక్తులు



రుద్రవరంలో గౌరీ దేవి అలంకారంలో అమ్మవారు



ఇంజేడులో మహాలక్ష్మి దేవి అలంకారంలో అమ్మవారు



బాలాజీ కల్యాణ మండపంలో చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం)/గోస్పాడు: దసరా శరన్నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గా మాత విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మిక నృత్యాలు, భక్తి సంగీత కచేరీలు, సంకీర్తనలు, కోలాటం, చెక్క భజన, హరికథ లు, నవరాత్రులపై ప్రవచనాలు జరిగాయి. నంద్యాల పట్టణంలోని కాళికాంబాదేవాలయంలో 108 శక్తిపీఠా ల అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.బాలాజీ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో రూ.5లక్షల కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీదేవిగా అలంకరించి లోక కల్యాణం కోసం చండీ హోమం నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహామాయి దే వి, సంజీవనగర్ రామాలయంలో మహాలక్ష్మీదేవి, బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయంలో గంగా, కామేశ్వరిదేవిలు రాజరాజేశ్వరి, భువనేశ్వరిగా దర్శనమిచ్చారు. బొమ్మలసత్రం శ్రీషిర్డిసాయిబాబా ఆలయంలో, బైర్మల్‌వీధిలోని ఆంధ్రాబ్యాంక్ వద్ద, వైఎస్సార్‌నగర్‌లోని కోదండ రామాలయంలో, జగజ్జననీ దేవాలయంలో అమ్మవార్లను అలంకరించారు.

దొర్నిపాడు / ఉయ్యాలవాడ / రుద్రవరం: శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు లలితాదేవీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అందజేశారు.

ఆళ్లగడ్డ: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాసవీమాత అమ్మవారు శ్రీ లలితా పరమేశ్వరీ దేవిగా భక్తులకు అభయమిచ్చారు. శనివారం శ్రీమత్కన్యకా పరమేశ్వరి దేవి శ్రీ లలితా పరమేశ్వరీ దేవి అలంకరణలో భక్తులను కనువిందు చేశారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సర్వతోభద్ర హోమం, కుంకుమ పూజలు చేశారు.

రైతు బాగుంటేనే దేశం సుభిక్షం



మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు సాయిరెడ్డి

నంద్యాల(వ్యవసాయం): రైతు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు సాయిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో జిల్లా కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ దేశంలోని 29 రాష్ట్రాల్లో భారతీయ కిసాన్ సంఘ్ కార్యవర్గాలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నాఫెడ్ ద్వారా పంట వచ్చే ముందుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మార్క్‌ఫెడ్, సివిల్ సప్లయ్ డిపార్టుమెంట్ ద్వారా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించి తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉమ్మడి సహదేవ రెడ్డి, కార్యదర్శి కిసాన్ మహేశ్వరరెడ్డి, సిద్ధారెడ్డి, అంకాల్‌రెడ్డి, తులసిరెడ్డి, వెంకటరాముడు, సూరిబాబు పాల్గొన్నారు.